క్లుప్తంగా

క్రీడాకారుడికి అభినందన



అక్షయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

ఆదోనిఅర్బన్: తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఈనెల 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే అంతర్ జిల్లా పోటీలకు ఆదోని క్రీడాకారుడు అక్షయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, ఉపాధ్యక్షుడు ముజీబ్, కార్యదర్శి కంబిరెడ్డి, సభ్యుడు వెంకటేష్, కోచ్ బాలాజీ క్రీడాకారుడిని అభినందించారు. అక్షయ్‌కుమార్ అండర్-16 విభాగంలో బౌలర్‌గా ఎంపికైనట్లు తెలియజేశారు.

రహదారికి మరమ్మతులు



హనుమన్‌నగర్‌లో గ్రావెల్ వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో గ్రావెల్ రోడ్డు వేసినట్లు సర్పంచ్ పాల్ దినకర్ తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఈ రోడ్లకు గ్రావెల్ వేసినట్లు ఆయన తెలిపారు. హనుమన్‌గేరి, పింజారిగేరి, ఎస్సీ కాలనీల్లోని రోడ్లతో పాటు వివిధ కాలనీల్లోని రోడ్లు వర్షానికి దెబ్బతిన్నాయని, దీంతో గ్రావెల్ వేసి మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు. మిగతా ఏరియాల్లో కూడా గ్రావెల్ వేస్తామని తెలిపారు. గ్రామంలో రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి పూర్తి సహకారం అందిస్తున్నారని, దీంతో పనుల్ని పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, పలువురు పాల్గొన్నారు.

నాడు-నేడు ద్వారా కళాశాల అభివృద్ధి



నిర్మాణంలో ఉన్న కళాశాల గేట్

కౌతాళం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కళాశాల ముందు భాగంగలో 1.20 లక్షలతో గేట్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ నిర్మాణం చివరి దశలో ఉందన్నారు. ఇప్పటికే తాగునీటి కోసం కొళాయి కనెక్షన్‌తో పాటు సంప్ నిర్మించినట్లు చెప్పారు. సంప్ నుంచి నీరు పంపింగ్ కోసం కళాశాల పైభాగంలో ట్యాంకును కూడా నిర్మించినట్లు వివరించారు. నీటి పంపింగ్ కోసం కొత్త మోటార్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. కళాశాలలో మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు అన్ని గదుల్లో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశామన్నారు. రూ.13 లక్షలతో నాడు-నేడు కింద వివిధ అభివృద్ధి పనుల్ని చేపట్టినట్లు ఆయన వివరించారు.

ఆర్‌ఏఎఫ్ సిబ్బంది కవాతు



మాధవరంలో ఆర్‌ఏఎఫ్ కవాతులో పాల్గొన్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం రూరల్: రానున్న ఎన్నికలు, శాంతి భద్రతల దృష్ట్యా ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో మంత్రాలయం, మాధవరం, రచ్చుమర్రి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆర్‌ఏఎఫ్ (ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్) 99 బెటాలియన్ కవాతు నిర్వహించారు. 60 మంది ఆర్‌ఏఎఫ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో ఈ కవాతును కొనసాగించారు. ప్రజలు కలసిమెలసి జీవించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దేశంలో శాంతి నెలకొల్పాలి

ఆదోని సెంట్రల్: దేశంలో శాంతి నెలకొల్పేందుకు తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు నీలకంఠప్ప పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. మహాత్మగాంధీ క్విట్ ఇండియా ఉద్యమంలో అగస్టు 8వ తారీఖున చేసిన ప్రసంగంలో డూ అర్ డై అనే నినాదం ప్రజలను ఎంతగానో అకర్షితులను చేసిందన్నారు. ప్రాణాలు తెగించి స్వాతంత్య్రం సంపాదించుకున్న దేశంలో రాజకీయ లబ్ధికోసం కూలల మధ్య చిచ్చు పెడుతున్నారని వాపోయారు. సర్వమత సమ్మేళనంగా పేరుగాంచిన భారత దేశంలో మత విద్వేశాలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దిలిప్‌దోకా, మారుతిరావు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- 40వ వార్డు పెద్దశక్తిగుడి ఏరియాలో 520 గడపల్లో ఎమ్మెల్యే పర్యటన
- ఘనస్వాగతం పలికిన స్థానికులు



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పరిష్కారం గాని సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డు పెద్ద శక్తిగుడి ఏరియాలో రాత్రి 8 గంటల వరకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ శాంత, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, పట్టణాధ్యక్షుడు దేవా, పార్టీ కార్యకర్తలు, నాయకులు, కౌన్సిలర్లు కార్యక్రమం నిర్వహించారు. 500కు పైగా గడపలకు తిరుగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ శాతం మంది మురుగు కాలువలు, రోడ్లు, కల్వర్టులు, వీధి లైట్ల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తామన్నారు. ఒక్కొక్క వార్డు సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకుగానూ ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, ఆ నిధులతో వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమన్నారు. వార్డుల అభివృద్ధి, పట్టణాభివృద్ధి విపక్షాలకు కనిపించడం లేదని, విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పగటి వేషగాళ్లలా ఇళ్లకు వచ్చి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వారి మాటలను నమ్మవద్దని సూచించారు. కౌన్సిలర్ ఇందు, వార్డు ఇన్‌చార్జ్ దుర్గప్ప, నాయకులు ఈరప్ప, తాయన్న, రామాంజనేయులు, సురేష, సనాఖాన్‌ఎక్బాల్, శ్రీలక్ష్మి, కల్పవల్లి, జిలేకాబీ, శ్రీదేవి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంగరాయుడికి ప్రత్యేకపూజలు



వడక జంధ్యం అలంకారంలో దర్శనమిస్తున్న మంగరాయ ఆంజనేయ స్వామి

ఆదోనిఅర్బన్/ఆదోని సెంట్రల్: అధిక మాసం సందర్భంగా మంగళవారం పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామికి వడక జంధ్యంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారి గురురాజ ఆచారి ఆంజనేయ స్వామికి ఫలపంచామృతాభిషేకం, తేనాభిషేకం, ప్రత్యేకంగా దూదితో చేసిన వడక జంధ్యంతో అలంకరణ, నైవేద్యం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికమాసం ఉండడంతో ఈ నెలలో సన్నిధిలో అనేక పూజలు, ప్రసంగాలు జరిపామని మేనేజర్ తెలిపారు. అందులో భాగంగానే భక్తులు దూదితో చేసిన వడక జంధ్యంను స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు వెల్లడించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రజా గాయకుడు, తన పాటలతో ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిన గద్దరన్నకు జోహార్లు అంటూ బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పి.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో సీపీయూ ఎస్ఐ జాతీయ కన్వీనర్ పి.కోదండ అదే శాల మేరకు గద్దర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. అణగారిన ప్రజలపై పెత్తందారులు చేస్తున్న దోపిడీ దౌర్జన్యాలను ఖండిస్తూ పోరాటం చేసిన మహానాయకుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తనదైన శైలిలో పాటలు రాస్తూ ప్రజలను ఉత్తేజ పరిచాడన్నారు. మహా ఉద్యమ కవి, పోరాటయోధుడు లేకపోవడం దురదృష్టకరమన్నారు. బీడీఎస్ఎఫ్ పట్టణ నాయకులు వెంకి, రాజు, సంజయ్, సూరి, సాగర్, సాయి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌యాదవ్ రాజీనామాతో సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌యాదవ్ పార్టీకి రాజీనామా చేయడంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఉమ్మడి కుటుంబ సభ్యులు వీరేష్, ఈరన్న, రామాంజనేయులు, రామంజిని, నగేష్, రాకేష్, మారెప్ప, రాజేష్, అర్జునప్ప, గోవర్ధన్ స్పష్టం చేశారు. చెప్పుడు మాటలు విని రమేష్‌యాదవ్ పార్టీకి రాజీనామా చేశాడని, త్వరలోనే ఆయన తిరిగి పార్టీలోకి వస్తాడన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ యాదవ్ కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నాయకులు రామలింగేశ్వరయాదవ్, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఓఎం క్రిష్ణమూర్తి, కౌన్సిలర్లు బాలాజీయాదవ్, సర్పంచ్ నగేష్ పాల్గొని మాట్లాడారు. తాము బతికున్నంతకాలం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతాయన్నారు. ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నివర్గాలకు ప్రాధాన్యత కల్పించారని, యాదవులు 9 గ్రామాల్లో సర్పంచులుగానూ, ముగ్గురు కౌన్సిలర్లుగానూ, ఇద్దరు ఎంపీటీసీలుగా గెలుపొందారన్నారు.

చిరువ్యాపారులకు అండ



పీఎం స్వానిధి కింద చెక్కులను పంపిణీ చేస్తున్న అధికారులు

ఆదోనిటౌన్: చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని లీడ్ బ్యాంక్ మేనేజర్ వీర రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఐకేపీ మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో పట్టణంలోని చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫేస్-1లో ఒక్కొక్క వ్యాపారికి రూ.10 వేలు, ఫేస్-2లో రూ.20 వేలు, ఫేస్-3లో పీఎం స్వానిధి కింద రూ.30 వేల నుంచి రూ.50 వేల దాకా సాయం అందజేయడం జరుగుతుందన్నారు. పథకం ఉద్దేశ్యం, ప్రభుత్వం అందిస్తున్న సాయం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే విషయాలను వివరించారు. ఐకేపీ మెప్మా ప్రాజెక్టు అధికారిణి, సిబ్బంది పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- మరికొందరు పరార్
- రూ.1,04,600 నగదు స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని కడితోట గ్రామ సమీపంలోని కమలమ్మ వంక వద్ద మంగళవారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు. ఆదోని పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన బోయ రవి, ఎల్ఐజీ కాలనీకి చెందిన కురువ నాగరాజు, బసాపురానికి చెందిన గంగన్న, నిజాముద్దీన్ కాలనీకి చెందిన మహ్మద్‌గౌస్, ఇమ్రాన్, తాహెర్, అమరావతినగర్‌కు చెందిన అల్తాఫ్, రమేష్, గోకారిజెండాకు చెందిన తాహెర్ పేకాట ఆడుతుండగా సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 52 పేక ముక్కలు, రూ.1,04,600 నగదు, 10 బైకులు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పోలీసులను చూసి పరారైన హవన్నపేటకు చెందిన సర్దార్, నిజాముద్దీన్ కాలనీకి చెందిన షాబ్జా, షేక్షా, కార్వన్‌పేటకు చెందిన చాంద్, మౌలి, గద్దం చాంద్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎల్లప్ప, బొబ్బిలిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్వరలోనే వారిని పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది కృష్ణమూర్తి, లక్ష్మినారాయణ, రాఘవేంద్ర, సుధాకర్‌లు ఉన్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ

మంత్రాలయం రూరల్: ఎంపీడీవో కార్యాలయం పక్కనున్న బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఎంపీడీఓ మణిమంజరీ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన రాత్రి భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు, మౌలిక వసతుల కొరత ఉన్నా తమ దృష్టికితీసుకురావాలన్నారు. బాగా చదువుకోవాలని సూచించారు.

సుళేకేరిలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు



నాడు ఎస్సీ కాలనీలోని రోడ్డు దుస్థితి



నేడు.. గ్రావెల్ వేసిన తర్వాత ఇలా..

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని రోడ్లు బురదమయంగా మారి నడవడానికి కూడా కష్టంగా ఉండడంతో గ్రావెల్ వేసి బాగు చేసినట్లు గ్రామ ఇన్‌చార్జ్ ఆదినారాయణ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో రోడ్డుకు గ్రావెల్ వేసినట్లు ఆయన మంగళవారం వెల్లడించారు. ఎస్సీ కాలనీల్లోని రెండు మూడు రోడ్లు అధ్వానంగా మారడంతో గ్రావెల్ వేసి మరమ్మతులు చేశామని త్వరలోనే మిగిలిన ఏరియాల్లో కూడా మరమ్మతు పనులు చేపడతామన్నారు.

ఆ జీఓలను ఉపసంహరించుకోవాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జీఓలను వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో పీడీఎస్‌యూ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ఈ జీఓల ద్వారా మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటా కింద వచ్చే సీట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం 25 శాతం సీట్లకే రిజర్వేషన్లను పరిమితం చేయడం సరికాదన్నారు. దీనివల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెడికల్ సీట్లు కేటాయింపు విషయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున, డివిజన్ నాయకులు రసూల్, సునీల్, మహేష్, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాలు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో అంగరంగా వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలు 29వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు అధ్యక్షతన అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో పాటు వసతి, సెక్యూరిటీ విభాగాల వారు హాజరయ్యారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్, పరిశుభ్రత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, డీటీ రాఘవేంద్ర, వీఆర్వో భీమన్నగౌడ్, ఈఓ నాగరాజు, వసతి విభాగం, శ్రీ మఠం సెక్యూరిటీ విభాగం వారు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలల ఎంపిక

ఆదోని సెంట్రల్: మొదటి దఫా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తయ్యింది. రెండవ దఫా వెబ్ ఆప్షన్ల ప్రక్రియను త్వరలో ప్రభుత్వం ప్రకటించనుందని ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివారెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆదోని డిగ్రీ కళాశాలలో బీఏ-40, బీకాం జనరల్-60, బీఎస్‌సీ బాటనీలో-40 సీట్లు ఉన్నాయని తెలిపారు. మొదటి దఫా ఆప్షన్‌లో విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. వెబ్‌ఆప్షన్‌లో కళాశాలను మార్చుకునేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థులు గమనించాలని సూచించారు. కళాశాలను వైఎంకే పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు పర్మిషన్ కోసం ఉన్నతాధికారులను నివేదిక పంపినట్లు పేర్కొన్నారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అనుమతి వచ్చిన వెంటనే కళాశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

11న వాహనాల వేలం

ఆదోనిఅర్బన్: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆదోని సబ్‌డివిజన్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 64 వాహనాలకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 11వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇందులో ఒక ఫోర్ వీలర్, ఆరు త్రీవీలర్స్, 57 టూ వీలర్స్ వాహనాలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ప్రవేశ రుసుము చెల్లించి, ఆధార్ కార్డు, ఐడీ ప్రూఫ్‌లతో వచ్చి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

నేటి నుంచి 'నా భూమి- నా దేశం'

మంత్రాలయం రూరల్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఓ తిమ్మారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి గ్రామంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శిలాఫలకం ఆవిష్కరణ, ప్రతిజ్ఞ, 75 మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. అమరవీరులు, స్వాతంత్య్రం సమరయోధులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెద్దకడబూరు: మండల పరిధిలో బుధవారం నుంచి 'నా భూమి - నా దేశం' కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. 9న తారాపురం, రంగాపురం, చిన్నకడబూరు. 10న జాలవాడి, కంబలదిన్ని, నాగులాపురం, బసలదొడ్డి, 11న కల్లుకుంట, చిన్నతుంబళం, గవిగట్టు, పీకలబెట్ట, బాపులదొడ్డి, 12న ముచ్చిగిరి, నౌలేకల్లు, మేకడోణ, హనుమాపురం, 14న కంబదహాల్, హెచ్.మురవణి, దొడ్డిమేకల, గంగులపాడు, 15న పెద్దకడబూరులో ఈ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

అస్వస్థతకు గురై వీఆర్‌ఏ మృతి



గోవిందు (ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో వీఆర్‌ఏగా పని చేస్తున్న గోవిందు (51) మంగళవారం అస్వస్థకు గురై చనిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం కర్నూలులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేసేందుకు సోమవారం తోటి వీఆర్‌ఏలతో కలసి వెళ్లాడు. రాత్రి అక్కడే సీఐటీయూ కార్యాలయంలో బస చేశాడు. మంగళవారం ఉదయం ధర్నాకు వెళ్లాల్సి ఉండగా ఆరోగ్యం బాగలేకపోవడంతో సొంత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకుని బస్టాండ్‌కు వచ్చి ఎమ్మిగనూరు బస్సు ఎక్కాడు. బస్సు కే.నాగలాపురం చేరుకోగానే ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. తోటి ప్రయాణికులు ఆయన చేతిలో తాళాలు పెట్టి చూశారు. వెంటనే అంబులెన్స్‌ను రప్పించి అందులోకి ఎక్కించారు. కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. ఆయన దగ్గరున్న ఫోన్‌బుక్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు కోడుమూరు వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడు గోవిందుకు భార్య కృష్ణమ్మ, కుమారుడు విష్ణు ఉన్నారు.

బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన మహ్మద్

మంత్రాలయం రూరల్: ఆదోని పట్టణం ఖాజీపేటకు చెందిన యువకుడు మహ్మద్ మంత్రాలయంలో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం ఖాజీపేటకు చెందిన ఇతను హోటల్లో పనిచేసేవాడు. మద్యానికి బానిసయ్యాడు. ఏడాది క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి ముగ్గురు సంతానం. దీంతో మానసికంగా కుంగిపోయాడు. రెండు రోజుల క్రితం మంత్రాలయానికి వచ్చి భిక్షాటన చేస్తున్నాడు. ఈ స్థితిలో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి చికిత్స చేయించారు. యువకుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన మునిస్వామి ఏపీ 21 బీడీ 2970 స్కూటీపై మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని రారావి నుంచి తరలిస్తుండగా బసాపురం ఎల్లెల్సీ కాలువ వద్ద పట్టుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 90 ఎంఎల్ పరిణామం గల ఒరిజినల్ ఛాయిస్ 480 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్య శాంతమ్మకు తక్షణ సాయం అందజేస్తున్న నాడుగేని నాగరాజు

కోసిగి: మండల కేంద్రంలోని రంగప్ప గట్టు కాలనీలో నివాసం ఉంటున్న పెర్లి కోసిగయ్య (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం కింద మంజూరైన రూ.10వేలను మృతుడి భార్య శాంతమ్మకు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు నాడుగేని నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శీల ప్రసన్న చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. మిగతా రూ.90 వేలు త్వరలో నేరుగా నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

ముళ్ల పొదల తొలగింపు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిపోయిన ముళ్ల పొదలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి సహకారంతో తొలగింపు పనులు చేపట్టారు. మంగళవారం గ్రామ సర్పంచ్ హారోన్, కాంట్రాక్టర్ బసిరెడ్డి ఆధ్వర్యంలో జేసీబీని ఏర్పాటు చేసి ముళ్ల పొదలు తొలగించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముళ్ల కంపలు తొలగించడంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మణిపూర్‌లో క్రైస్తవులకు రక్షణ కల్పించాలి



కోసిగిలో రాలీ నిర్వహిస్తున్న ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకులు, క్రైస్తవులు

కోసిగి: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ కోసిగి మండల గౌరవాధ్యక్షుడు మాణిక్యరాజు, గౌరవ సలహాదారు సొట్టయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం కోసిగిలో ఏపీ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక క్రీస్తు సంఘం చర్చి పాస్టర్ రాజారత్నం, దేవ పుత్ర ఆధ్వర్యంలో కడపొళెం సీఎస్ఐ, రోమన్ క్యాథలిక్, యేసయ్య కృప, ఏప్తా సంఘాల పరిధిలోని దాదాపు 1000 మందికి పైగా క్రైస్తవులు పాల్గొన్నారు. ముందుగా నాడుగేని వీధిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 10 నిముషాల పాటు మోకాళ్ల పై కూర్చొని దేవుడి ప్రార్థన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

పూడికతీత పనుల తనిఖీ

ఆదోనిటౌన్ : పట్టణంలోని పాత బస్టాండు ఏరియా మర్చంట్స్ క్లబ్ ఏరియాలో జరుగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, మంజునాథ్, మేస్త్రీ బాషాలతో కలిసి పరిశీలించారు. కాలువ చిన్నది కావడం వల్లనే చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయని, కాలువ పునఃనిర్మాణం, సెల్‌ఫోన్, విద్యుత్ తీగలు కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ కవర్లు కాలువలో పారవేయడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పాడుతోందని కమిషనర్ తెలిపారు. కాలువ విస్తరించి, పూడికను ఎప్పటికప్పుడు తొలగించడంతో సమస్య పరిష్కారమవుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మహావీర్ కాలనీలోని మున్సిపల్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు.

బదిలీ అధికారికి సన్మానం



అధికారిని సన్మానిస్తున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం రైల్వే ఇంజినీరింగ్ సెక్షన్‌లో సీనియర్ రైల్వే ఇంజినీర్‌గా పని చేస్తున్న పి.వి.రాహుల్‌ను విజయవాడ ఇంజినీరింగ్ సెక్షన్‌కు బదిలీ చేశారు. మంగళవారం పట్టణంలోని రైల్వే ఇంజినీరింగ్ సెక్షన్ కార్యాలయంలో పి.వి రాహుల్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజనల్ రైల్వే అసిస్టెంట్ ఇంజినీర్ సిరాజ్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. రాహుల్ జూనియర్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బాధ్యతాయుతంగా పని చేస్తూ సిబ్బంది మన్ననలు పొందారన్నారు. సీనియర్ ఇంజినీర్‌గా ప్రమోషన్ పొంది దాదపు 9 సంవత్సరాలు ఆదోని రైల్వే సెక్షన్‌లో పని చేయడం గొప్ప విషయమన్నారు. అక్కడ కూడా ఇలాగే పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ అరుణ్‌కుమార్, రైల్వేస్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు, సిగ్నల్ డిపార్ట్‌మెంట్ అధికారి నాయుడు, ఇంజనీరింగ్ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత బాలనాగన్నకు నివాళి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని కమ్యూనిస్టు యోధుడు ఓ.బాలనాగన్న 12వ వర్థంతి కార్యక్రమం మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఓ.బాలనాగన్న ఆదోని ప్రాంత కమ్యూనిస్టు యోధుడు అని చెప్పారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ప్రతిఒక్కరు బాలనాగన్న ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అజయ్‌బాబు, భాస్కర్‌యాదవ్, పంపన్నగౌడ్, రంగన్న, గోపాల్, ఎస్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

వెల్దుర్తి: పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నూరు శాతం సబ్సిడీతో మొక్కలు, నిర్వహణ ఖర్చులు ఇస్తోందని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి వివరించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కొసనాపల్లెలో రైతు పొలంలో ఈజీఎస్ సబ్సిడీ ద్వారా నాటిన చీని మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వెల్దుర్తి మండలంలో ఈ ఏడాది దాదాపు 270 ఎకరాల్లో తమ శాఖ ద్వారా పండ్ల తోటల సాగుకు సహకారం అందించినట్లు తెలిపారు. చీని, జామ, దానిమ్మ, మునగ ఇతరత్రా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఓ రాజునాయక్, ఈసీ భరత్, టీఏలు రాజు, శ్రీనివాసరావ్ వెంట ఉన్నారు.